



కొలనుభారతిలో కొండపై నుంచి జాలువారుతున్న జలపాతం



గలగలలు.. కిలకిలలు

● ఆకట్టుకుంటున్న జలపాతాలు ● సందడి చేస్తున్న పక్షులు

ఆత్మకూరు, ఆగస్టు 10: పక్షుల కిలకిలరావాలు.. జాలువారుతున్న జలపాతాలు.. ఏపుగా పెరిగిన చెట్లు.. అల్లుకుపోయిన ముళ్లపొదలు.. సందడి చేస్తున్న జంతువులు.. వెరసి నల్లమల అందాలు కట్టిపడేస్తున్నాయి. జీవ వైవిధ్యానికి మారుపేరుగా నిలిచిన నల్లమల ఇటీవల కురిసిన వర్షాలతో పచ్చదనంతో నిండిపోయి ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది. సుమారు 100 నుంచి 200 అడుగుల ఎత్తు గల కొండల మీద నుంచి వర్షపు నీరు కిందికి దూకుతో కనువిందు చేస్తోంది. నల్లమలలోని చిన్నగుమ్మితం ఆలయానికి సమీపంలో ఉన్న జలపాతం పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. అలాగే ఆత్మకూరు రేంజ్‌లోని కొలనుభారతి, శ్రీశైలం రేంజ్‌లోని భీమునికొలను, పెచ్చెర్వు సమీపంలోని పంగిడి, వెలుగోడు రేంజ్‌లోని నాగులగుండం, నాగలూటి రేంజ్ ఇందిరేశ్వరం ఈస్ట్‌బీట్‌లో చిన్నసరి, పెద్దసరి జలపాతాలు, రోళ్లపెంట బేస్ క్యాంప్ సమీపంలో ఉన్న జలపాతం, శ్రీశైల క్షేత్రంలోని సిద్దరామప్పకొలను జలాపాతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే వీటిలో చాలా వరకు నల్లమల అంతర్భాగంలో ఉండటం వల్ల అక్కడికి వెళ్లేందుకు పర్యాటకులు అటవీ అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. ఇదిలావుంటే కొలనుభారతి క్షేత్రంలో జాలువారే జలపాతమే చారుఘోషినీ పుణ్యతీర్థంగా పేరుగాంచింది. నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి ఇరువైపులా పరుచుకున్న పచ్చదనం ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. పచ్చిక బయళ్లు ఉన్న పలు ప్రదేశాల్లో జింకలు, ఇతర వన్యప్రాణులు ప్రయాణికుల్ని కనువిందు చేస్తున్నాయి. బైర్లూటి నుంచి దోర్నాల సమీపంలోని కొర్రప్రోలు వరకు కేజీ రహదారి వరకు పచ్చదనమే కనిపిస్తోంది. రోళ్లపెంట ఘాట్ వద్ద ఉన్న కొండలు సైతం పచ్చదనాన్ని సంతరించుకున్నాయి.



పరవళ్లు తొక్కుతున్న చారుఘోషిణి



కేజీ రోడ్డుపై నల్లమల అందాలు



చిన్నగుమ్మితం సమీపంలో నల్లమల నుంచి జాలువారుతున్న జలపాతం

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం: మంత్రి బీసీ



అవుకు రిజర్వాయర్ వద్ద జలహారతి ఇస్తున్న మంత్రి బీసీ

అవుకు, ఆగస్టు 10 : శ్రీశైలం నుంచి వచ్చే వరద నీటితో జలాశయాలను నింపి చివరి ఆయకట్టుకు నీరందిస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. శనివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎస్సార్బీసీ సీఈ కబీర్‌బాషా, కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, అవుకు మండలం టీడీపీ అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, అవుకు మండల జడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి, కడప జిల్లా టీడీపీ నాయకులు బీటెక్ రవి, భూపేష్‌రెడ్డితో కలిసి అవుకు జలాశయం వద్దకు చేరుకున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అధికారులు పుష్పగుచ్ఛాలు అందించారు. జలాశయం వద్ద గంగమ్మకు పూజలు చేసి జలహారతి ఇచ్చారు. అనంతరం అవుకు జీఎన్ఎస్ఎస్ హెడ్‌రెగ్యులేటర్ వద్దకు చేరుకొని కడప జిల్లాకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 4.148 టీఎంసీలు కాగా ఎస్సార్బీసీ, జీఎన్ఎస్ఎస్ నుంచి 12 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందన్నారు. రిజర్వాయర్‌లో 3.50 టీఎంసీలు నీరు చేరటంతో కడపకు 10వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని తెలిపారు. ప్రాజెక్టుల అనుసంధానంతోనే రాయలసీయ సశ్యశ్యామలమం అవుతుందన్నారు. 2014-2019లో తెలుగుదేశం ప్రభుత్వం రాయలసీమలో ప్రాజెక్టుల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం డబ్బు సంపాదనే మార్గంగా పని చేసి రాష్ట్రంలోని వనరులను దోచుకుందని విమర్శించారు. జీఎస్ఎస్ఎస్ కెనాల్ ద్వారా మైలవరం, గండికోట, చిత్రావతి, పైడిపాలెం ప్రాజెక్టులను సెప్టెంబరు నెల చివరిలోపు నింపుతామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మొట్ల రామిరెడ్డి, బత్తిని మద్దిలేటిగౌడు, వెంకట రమణనాయక్, దంతెల రమణ, మారం పుల్లారెడ్డి, నారపురెడ్డి, బాలనాగిరెడ్డి, ఎస్సార్బీసీ ఎస్ఈ వరప్రసాద్, ఈఈలు సురేష్‌బాబు, రాధాకృష్ణారెడ్డి, సురేష్, డీఈలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎన్ఎస్ఎస్ నుంచి కడప జిల్లాకు నీటి విడుదల



అవుకు జీఎన్ఎస్ఎస్ హెడ్‌రెగ్యులేటర్ నుంచి కడపకు వెళ్తున్న కృష్ణా జలాలు

వివిధ విభాగాలపై ఎస్పీ సమీక్ష

నంద్యాల క్రైం, ఆగస్టు 10: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం పోలీస్ శాఖలోని వివిధ విభాగాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఫ్యాక్షన్ జోన్, స్పెషల్ బ్రాంచ్, సీసీ కెమెరాల నిర్వహణ (పీసీఆర్) తదితర విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు, సంబంధిత సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లాలోని ఫ్యాక్షన్ గ్రామాలు అక్కడి వర్గ, రాజకీయ కక్షలు, నెలకొనే ఉద్రిక్త పరిస్థితులు, అక్కడక్కడా జరిగే ఘర్షణలు, గొడవలు, అల్లర్లు తదితర వాటిపై సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితులు, ఘర్షణలు చోటుచేసుకునే ప్రాంతాల్లో, ఫ్యాక్షన్ గ్రామాలపై నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు సమాచారంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులు,సిబ్బంది ఎప్పటికప్పుడు జిల్లాలో జరిగే సమాచారం తనకు అందజేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నంద్యాలలోని ముఖ్య కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను తెలియజేసి నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సూచించారు. విధుల్లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

కిలో యాలకలు రూ.3,600

కొలిమిగుండ్ల, ఆగస్టు 10 : యాలకల ధరలు చుక్కల నంటుతున్నాయి. ప్రపంచంలో లభించే అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో యాలకలు కూడా ఉన్నాయి. తేనీరు మొదలుకొని అన్ని రకాల స్వీట్లలో యాలకలను తప్పనిసరిగా వాడతారు. వీటిల్లో అనేక ఔషధ గుణాలు కలిగి ఉండటంతో ఆయుర్వేదం మందుల్లో కూడా వీటిని ఉపయోగిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన యాలకల ధరలు ప్రస్థుతం మార్కెట్లో అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి. సరిగ్గా ఏడాది క్రితం రూ.1600 నుంచి రూ.2000 వరకు ఉన్న యాలకల ధరలు అంతకంతకూ పెరుగుతూ ప్రస్తుతం రూ.3600 చేరుకున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. శ్రావణ మాసం కావడం, వరుస పర్వదినాలు, శుభకార్యాలతో వీటి అవసరం మరింత పెరిగిందని, ధరలు మాత్రం కొనలాంటేనే భయపెడుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. భారతదేశంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే వీటిని సాగు చేసే పరిస్థితి ఉండటం కూడా ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది.



నామినేటెడ్‌పై ఆశలెన్నో... ?



● డోన్ నుంచి టీడీపీ ముఖ్య నేతల ప్రయత్నాలు
● పదవులను దక్కించుకునేందుకు పావులు
● ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కే అవకాశం

డోన్, ఆగస్టు 10 : టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో డోన్ నియోజకవర్గంలోని పలువురు టీడీపీ ముఖ్య నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. సీఎం చంద్రబాబు నామినేటెడ్ పదవులను త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించడంతో.. ఆశావహుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. దీంతో అప్పుడే పలువురు టీడీపీ ముఖ్య నేతలు పదవులను దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కష్టపడిన వారికి ప్రాధాన్యత ఉంటుందని సీఎం చంద్రబాబు చెబుతుండటంతో నామినేటెడ్ పదవులు ఎవరిని వరిస్తాయో అన్నదే రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నామినేటెడ్ రేసులో ధర్మవరం సుబ్బారెడ్డి



నామినేటెడ్ పదవుల రేసుల్లో డోన్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో చైర్మన్ పదవి దక్కవచ్చని రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో డోన్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా మూడేళ్ల పాటు ధర్మవరం సుబ్బారెడ్డి పని చేశారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. అప్పట్లో డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా సుబ్బారెడ్డి పేరును టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించడం కూడా జరిగింది. అయితే ఎన్నికల ముందు డోన్ నియోజకవర్గంలో ఊహించని రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును చంద్రబాబు ప్రకటించారు. సుబ్బారెడ్డికి తప్పనిసరిగా న్యాయం చేస్తానని ఎన్నికల సమయంలోనే చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తుండటంతో.. డోన్ నియోజకవర్గానికి చెందిన ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే సీఎం చంద్రబాబును సుబ్బారెడ్డి రెండు సార్లు కలిశారు. దీంతో రాష్ట్ర స్థాయిలో చైర్మన్ పదవి ఇవ్వవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎమ్మెల్సీ పదవి కోసం సుబ్బారెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

టీఈ కేశన్నగౌడుకు ఏ పదవి దక్కేనో..?

డోన్ నియోజకవర్గంలో కోట్ల కుటుంబానికి ఎంతో విధేయుడుగా ఉన్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడుకు నామినేటెడ్ పదవి ఏది దక్కుతుందోనని చర్చనీయాంశంగా మారింది. కేఈ కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న కేశన్నగౌడు.. ఆ తర్వాత కోట్ల కుటుంబానికి విధేయుడుగా మారిపోయారు. టీడీపీలో కీలక నేతగా ఉన్న కేశన్నగౌడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత నినాదంతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. అనతి కాలంలోనే బీసీల్లో బలమైన నేతగా ఎదిగారు. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేశారు. దీంతో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి టీఈ కేశన్నగౌడుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. కేశన్నగౌడుకు ఏ పదవి వరిస్తుందన్నదీ సర్వత్రా చర్చగా మారింది.



వలసల రామకృష్ణ నామినేటెడ్‌పై ఆశలు

నామినేటెడ్ పదవిపై డోన్ నియోజకవర్గానికి చెందిన మరో నేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వలసల రామకృష్ణ చురుకుగా పని చేశారు. ప్రజా సమస్యలపై బలంగా తన వాణిని వినిపించారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో రామకృష్ణ ఎంతో కృషి చేశారు. గతంలో డోన్ ఎంపీపీగా, జడ్పీటీసీగా రామకృష్ణ పని చేశారు. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల భర్తీకి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వలసల రామకృష్ణ పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే డోన్ ఎమ్మెల్యే కోట్లతోపాటు రాష్ట్ర నాయకత్వాన్ని కలిసి న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది.

వై.నాగేశ్వరరావు యాదవ్ ముమ్మర ప్రయత్నాలు



డోన్ నియోజకవర్గానికి చెందిన మరో ముఖ్య నేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ నామినేటెడ్ పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు నాగేశ్వరరావు యాదవ్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇప్పటికే డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ద్వారా పలువురు రాష్ట్ర మంత్రులను కలిసి రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరినట్లు సమాచారం. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పలుమార్లు కలిసి తన కష్టాన్ని గుర్తించాలని నాగేశ్వరరావు యాదవ్ కోరినట్లు తెలిసింది. టీడీపీ రాష్ట్ర యాదవ సాధికార సమితి కన్వీనర్‌గా నాగేశ్వరరావు యాదవ్ పని చేశారు. రాష్ట్ర స్థాయిలో యాదవులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించి పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. అంతేగాక బీసీల సదస్సులను నిర్వహించి సీఎం చంద్రబాబు దృష్టిలో పడ్డారు. దీంతో నాగేశ్వరరావు యాదవ్‌కు కూడా రాష్ట్ర స్థాయిలో చైర్మన్ పదవి రావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పలువురు జనసేన, బీజేపీ నేతల ఆశలు

నామినేటెడ్ పదవుల్లో టీడీపీ కూటమి పార్టీల భాగస్వామ్యంతో భర్తీ చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో డోన్ నియోజకవర్గంలోని జనసేన, బీజేపీ నాయకులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గ స్థాయి, మండల స్థాయిల్లో నామినేటెడ్ పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ నామినేటెడ్ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే డోన్ ఎమ్మెల్యేను కలిసి ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, గడ్డం బ్రహ్మం నామినేటెడ్ పదవులపై ఆశలు పెంచుకున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో సముచిత స్థానం లభిస్తుందని జనసేన నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీరెడ్డి ప్రయత్నాలు



కోట్ల కుటుంబానికి ఎంతో సన్నిహితంగా ఉన్న డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కసాగరం లక్ష్మీరెడ్డి నామినేటెడ్ పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట నుంచి కోట్ల కుటుంబంతో అత్యంత సన్నిహితంగా ఉంటూ వస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ కోట్ల వెంట నడిచి విస్తృతంగా ప్రచారం నిర్వహించి కోట్ల ఎమ్మెల్యేగా గెలుపొందేందుకు ఆయన కృషి చేశారు. అప్పట్లో కర్నూలు ఎంపీగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఉన్న సమయంలో లక్ష్మీరెడ్డి డీసీఎంఎస్ చైర్మన్‌గా పని చేశారు. ఇప్పుడు కూడా జిల్లా స్థాయి నామినేటెడ్ పదవి కోసం లక్ష్మీరెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ద్వారా జిల్లా స్థాయి పదవిని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీంతో లక్ష్మీరెడ్డికి ఏ పదవి వస్తుందోన్నది వేచి చూడాల్సిందే.



వధువరుల సమక్షంలో రక్తదానం చేస్తున్న స్నేహితులు

పెళ్లిపందిట్లో రక్తదానం!

ఆళ్లగడ్డ, ఆగస్టు 10: ఆళ్లగడ్డ పట్టణంలో నందింపల్లె గ్రామానికి చెందిన తలారి మహేంద్ర తన వివాహం సందర్భంగా రక్తదాన శిబిరం శనివారం నిర్వహించి ఆదర్శంగా నిలిచారు. రక్తదానంపై ప్రజల్ని చైతన్యవంతులు చేసేందుకు ఈ కార్యక్రమం తలపెట్టినట్లు వరుడు చెప్పారు. పెళ్లికి వచ్చిన పలువురు బంధుమిత్రులతో రక్తదానం చేయించారు. సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా వధువరులు సాయిలక్ష్మీదేవి, మహేంద్రలను పలువురు అభినందించారు.

చింతలచెరువులో నీట మునిగిన పంటలు



కోతకు గురైన టీజీపీ పంట కాలువ

చాగలమర్రి, ఆగస్టు 10: చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామ సమీపంలోని టీజీపీ బ్లాక్ చానల్ శనివారం కోతకు గురైంది. పంట కాలువలో ప్రవహించే నీరు రైతులు సాగు చేసిన వంద ఎకరాల్లో వరి, మొక్కజొన్న, ఉల్లి పంటలు నీట మునిగాయి. 36వ బ్లాక్ చానల్ పరిధిలో పంట కాలువ పొంగి ప్రవహించడంతో కాలువ వెంటగల పొలాలు నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. ఇప్పుడిప్పుడే వేసిన వరి నాట్లు, ఉల్లి పంట దెబ్బతిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. టీజీపీ ప్రధాన కాలువ నుంచి 36వ బ్లాక్‌చానల్‌కు గేట్లను ఎత్తి నీరు విడుదల చేయడంతో కాలువ వెంట నీరు అధికంగా రావడంతో పొంగి ప్రవహించింది. చాగలమర్రి గ్రామ సమీపంలోని చివరి ఆయకట్టు పరిధిలోగల మొక్కజొన్న పంట నీట మునిగింది. రత్నామాచారి, ప్రసాదురెడ్డి, హరినాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, చిన్నపురెడ్డి, మరి కొందరు రైతులు వేసిన వరి నాట్లు, ఉల్లి పంట నీట మునిగి నష్టం వాటిల్లిందని వాపోయారు. పంట కాలువలు సరిగా లేకపోవడం వల్ల పంట పొలాల్లో ప్రవహించడంతో నష్టపోతున్నామని అన్నారు. ఇప్పుడిప్పుడే సాగు చేసిన పంటలు నీట మునగడంతో పంట దిగుబడి రాదని రైతులు విలపిస్తున్నారు. నీట మునిగిన పంట పొలాలకు పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయం గురించి టీజీపీ ఏఈ సలీమ్‌ను వివరణ కోరగా టీజీపీ ప్రధాన కాలువ నుంచి 36వ బ్లాక్‌చానల్‌కు గేట్లను ఎత్తి అడుగు నీరు విడుదల చేశామని అన్నారు. కాలువకు నీరు అధికమై పొంగి ప్రవహించిందని అన్నారు. కొన్ని చోట్ల రైతులే నీటి కోసం కట్టలు వేసుకోవడం వల్ల నీటి ఉధృతి పెరిగి పంట పొలాల్లో ప్రవహించిందని అన్నారు. పంట కాలువకు నీరు తగ్గించామని అన్నారు. టీజీపీ ప్రధాన కాలువ వద్దగల డిస్ట్రిబ్యూటరీ సెట్టర్‌ను తగ్గించి అడుగు నీరు మాత్రమే విడుదల చేశామని తెలిపారు.

రాఘవేంద్రుని సన్నిధిలో నాగసాధువులు

మంత్రాలయం, ఆగస్టు 10: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఐదుగురు నాగసాధువులు శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. దేశంలోని వివిధ పుణ్య క్షేత్రాలు సందర్శనలో భాగంగా మంత్రాలయం వచ్చినట్లు నాగసాధువులు తెలిపారు. వీరి వెంట బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి ఉన్నారు.

రూ.15 కోట్ల పంట రుణాలు విడుదల

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 10: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఒక్క సహకార సంఘాలకు తప్ప మిగిలిన వాణిజ్య బ్యాంకుల్లో రుణాల పంపిణీ ఇప్పటికే మొదలైంది. కర్నూలు, నంద్యాల జిల్లాలో 99 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల ద్వారానే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు నాలుగున్నర లక్షల మంది రైతులకు రుణాలు అందుతున్నాయి. ఈసారి వివిధ కారణాల వల్ల సహకార సంఘాల్లో రుణాల పంపిణీ ఇప్పటి దాకా మొదలు కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు రైతుల నుంచి ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో ఎట్టకేలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.15 కోట్లను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు విడుదల చేశారు. ఆయా సంఘాల పరిధిలో కౌలు రైతులకు రూ.10 లక్షలు, సొంత పొలం ఉన్న రైతులకు రూ.15 లక్షలు మొత్తం ఒక్కో సంఘానికి రూ.25 లక్షల చొప్పున రూ.15 కోట్లు విడుదల చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్ తెలిపారు. త్వరలోనే అర్హత ఉన్న రైతులందరికీ జిల్లా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రుణాలు అందిస్తామని చెప్పారు.

నేటి నుంచి టమోటా కొనుగోళ్లు



పత్తికొండ, ఆగస్టు 10: పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆది వారం నుంచి టమోటా కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్లు కార్యదర్శి కార్నలిస్ తెలిపారు. ఆదివారం ఉయయం 8గంటలకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించి టమోటా కొనుగోళ్లను ప్రారంభిస్తారన్నారు. రైతులు సాగు చేసిన టమోటా పంటను విక్రయాలకు మార్కెట్‌కు తీసుకు రావాలన్నారు.

ఫ్యాక్షన్‌కు మళ్లీ ఆజ్యం పోస్తున్న జగన్

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి


కర్నూలు(కల్చరల్), ఆగస్టు 10: రాయలసీమలో తిరిగి ఫ్యాక్షన్ గొడవలకు సైకో జగన్ రెడ్డి ఆజ్యం పోస్తున్నాడని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అన్నారు. శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో గడచిన 20 ఏళ్ల నుంచి అంతరించిపోయిన ఫ్యాక్షన్ రాజకీయాలను మాజీ ముఖ్యమంత్రి జగన్ తిరిగి ఆజ్యంపోసి ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు. మహానంది మండలం సీతారామపురం గ్రామంలో జరిగిన హత్యపై జగన్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. జరిగిన హత్యను టీడీపీపై ఆపాదించడం, టీడీపీ నేతలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేయడం సరైంది కాదన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో లెక్కలేనన్ని హత్యలు జరిగాయని, అందుకు జగనే బాధ్యుడన్నారు. సొంత బాబాయ్‌ని హత్యపై స్పందించని జగన్.. సొంత చెల్లి, తల్లి రోడ్డున పడితే వారికి సమాధానం ఇవ్వలేని వ్యక్తి ఇప్పుడు చంద్రబాబుపై కేసులు పెట్టాలని కోరడం సిగ్గుచేటన్నారు. వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే దాన్ని టీడీపీకి అంటగట్టి లబ్ధిపొందాలని చూస్తున్న జగన్‌కు 151 సీట్ల నుంచీ 11 సీటకు ఓడించినా ఇంకా సిగ్గురాలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్న రోజుల్లో జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలపై శ్రద్ధ చూపని జగన్ హత్యలపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డికి బెయిల్ రద్దయి తిరిగి జైలుకు వెళ్లడం తప్పదన్నారు. ఆయన ఇప్పటికైనా చీప్ పాలిటిక్స్ మానుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, కేవీ సుబ్బారెడ్డి, నాయకులు డి.జేమ్స్, ఎస్.ముంతాజ్, పి.హనుమంతరావు చౌదరి, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.తిక్కారెడ్డి, టీడీపీ నాయకులు

రాఘవేంద్ర స్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు



మంత్రాలయం, ఆగస్టు 10: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 18 నుంచి 24వరకు జరిగే సప్తరాత్రోత్సవాల్లో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. ఈ నెల 20న పూర్వారధన, 21న మధ్యారాధన, 22న ఉత్తరాధనలు జరుగుతాయన్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఏపీలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది సుమారు 5 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వసతి, కల్యాణమండపాలు, శుభ్రమైన రోడ్లు, క్యూలైన్లు, నదితీరంలో స్నానఘట్టాలు, ఉచిత అన్నదానం, తాగునీరు, ఉచిత వైద్య కేంద్రాలు వంటి మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ బిందు మాధవ్, సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, డీఆర్వో మధుసూదన్‌రావు, డీపీవో నాగరాజునాయుడు ఇతర అధికారులు సహకరిస్తున్నారని తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు 7 లక్షలు పరిమళ ప్రసాదం పంపిణీకి సిద్ధం చేస్తున్నామన్నారు. రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులు -2024లో వివిధ సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన నలుగురికి పీఠాధిపతి ఎంపిక చేశామని 20వ తేదీన ముగ్గురికి, 22న మహారథోత్సవం దగ్గర మైసూరు రాజుకు పీఠాధిపతి అవార్డును ప్రదానం చేస్తారన్నారు.

కర్నూలు జేసీగా నవ్య

- గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు నుంచి జేసీగా బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జాయింట్ కలెక్టర్‌గా తొలి సారిగా బాధ్యతలు



కర్నూలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి)/ కర్నూలు కలెక్టరేట్: కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)గా బి.నవ్య నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరుగా పని చేస్తున్న నవ్యను కర్నూలు జేసీగా బదిలీ చేశారు. ఇక్కడ జేసీగా పని చేసిన నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది. ప్రస్తుతం డీఆర్వో మధుసూదన్‌రావు ఇన్‌చార్జి జేసీగా కొనసాగుతున్నారు. కర్నూలు జేసీగా నియమితులైన నవ్య త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రజ్యోతికి వివరించారు. రాజమండ్రి జిల్లాకు చెందిన బి.నవ్య తండ్రి రాంమోహన్‌రావు ఉద్యోగరిత్యా ఈ ప్రాంతంలోనే ఎక్కువ కాలం పనిచేశారు. దీంతో ఆమె ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు రాజమండ్రిలోనే విద్యాభ్యాసం సాగించారు. డెంటల్ డాక్టర్‌గా కొనసాగుతున్న ఆమె 2009లో గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి హైదరాబాదులోని సీసీఎల్ఏలో బాధ్యతలు చేపట్టారు. తరువాత హైదరాబాద్ డివిజన్ ఆర్డీఓగా, మర్రిచెన్నారెడ్డి మానవ వనరులు అభివృద్ధి సంస్థ (ఎంసీహెచ్‌ఆర్‌డీ) ఫ్యాకల్టీగా పని చేశారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీకి వచ్చిన ఈమే సీసీఎల్ఏ పీడీ సీఎంఆర్ఓ, కొవ్వూరు ఆర్డీఓ, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (నుడా) వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2016లో ఐఏఎస్ అధికారిగా పదోన్నతి పొందారు. పార్వతిపురం మన్యం జిల్లా సీతంపేట ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వర్తించారు. అక్కడి బదిలీఅయి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరుగా గత నెల 24 బాధ్యతలు చేపట్టారు. ఇంతలోనే కర్నూలు జేసీగా ప్రభుత్వం బదిలీ చేసింది. సీతంపేట ఐటీడీఏ పీవోగా పని చేస్తున్న సమయంలో ఆరో తరగతి చదువుతున్న కుమారుడు బి.శ్రీకర్ ప్రతిక్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఓ ఐఏఎస్ అధికారి కొడుకును ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం అప్పట్లో చర్చగా మారింది.

కొత్తగా నాలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులు

జెండా ఊపి ప్రారంభించిన మంత్రి టీజీ భరత్

కర్నూలు(రూరల్)ఆగస్టు10: ప్రయాణికుల సౌకర్యార్థం కోసం ఆర్టీసీ యాజమాన్యం మరో నాలుగు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేసింది. శనివారం కర్నూలు-1డిపో గ్యారేజిలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి నూతన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు సీఎం చంద్రబాబు విధివిధానాలు రూపొందించి వాటిని అమలు పరుస్తామన్నారు. కొత్త బస్సులను కర్నూలు నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, శ్రీశైలంతో పాటు ఎమ్మిగనూరు-హైదరాబాద్ మార్గాల్లో ప్రయాణిస్తాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు, కర్నూలు-1,2డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్‌హుస్సేన్, డిపో అసిస్టెంట్లు మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

సినీ ఫక్కీలో కారు అపహరణ

మూడు రోజుల్లోనే ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 10: కారు అపహరణ కేసును పోలీసులు మూడు రోజుల్లోనే ఛేదించారు. ఎమ్మిగనూరు రూరల్ సీఐ విక్రమ్‌సింహ వివరాల మేరకు.. కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లా ముదొల్‌కోడ్‌కు చెందిన అనీల్ బీరాదార్, శిరోర్‌కు చెందిన సంతోష్‌హట్టిలు హైదరాబాద్ నుంచి మంత్రాలయం వెళ్లాలని ఊబర్‌లో కారును బుక్ చేసుకున్నారు. కారు ఓనర్ ప్రసాద్ అనీల్, సంతోష్‌లను కాచిగూడ దగ్గర ఎక్కించుకొని జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్, రాయచూరు మీదుగా మంత్రాలయం వరకు వెళ్లాడు. కారులో వచ్చిన ఇద్దరు మంత్రాలయంలో దిగకుండా సమీపంలోనే మరో ఊరిలో తెలిసిన వారు ఉన్నారని, అక్కడికి వెళ్దామని చెప్పారు. అలా జాతీయ రహదారి మీదుగా ఎమ్మిగనూరు వైపునకు తీసుకెళ్లారు. నందవరం మండలం హాలహర్వి గ్రామం దాటిన తరువాత కారు ఆపారు. స్నానాలు చేసి వస్తామని చెప్పి కొంత దూరం అలా ముందుకు వెళ్లి మళ్లీ కారు దగ్గరకు వచ్చారు. కారులో ఉన్న డ్రైవర్ ప్రసాద్‌కు ముఖంపై మత్తు మందును స్ప్రే చేసే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన ప్రసాద్ ఇరువురిని నెట్టివేసి కారులో మంత్రాలయం వైపు పరుగులు తీశాడు. అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా తమ పరిధిలోకి రాదని, నందవరం పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ తరువాత దుండగులు కారును అక్కడి నుంచి కర్ణాటకలోని గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న సీఐ విక్రమ్‌సింహ కర్ణాటకలోని రాయచూరు జిల్లా గిలక సూగూరు క్యాంపు దగ్గర నిందితుల్లో ఒకరైన అనీల్ బారాదర్‌ను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సంతోష్‌హట్టి అనే నిందితుడి కోసం గాలిస్తున్నారు.

త్వరలో కేడీసీసీబీ విభజన

నంద్యాలలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు సేవలు

కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 10: జిల్లా సహకార కేంద్ర బ్యాంకును త్వరలోనే విభజించనున్నారు. ఈ క్రమంలోనే నంద్యాలలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమైంది. అమరావతిలో ఇటీవల జరిగిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల సీఈవో సమావేశంలో ఉన్నతాధికారులు ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు ప్రధాన కార్యాలయంతోపాటు 20 శాఖలు, మరో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఈ బ్యాంకు ద్వారా రైతులకే కాకుండా మిగిలిన వర్గాలకు సైతం ప్రయోజనాలు అందిస్తున్నారు. దాదాపు రూ.3,500 కోట్ల వ్యాపార అభివృద్ధితో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రెండో స్థానం దక్కించుకుంది. గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి అవార్డును కైవసం చేసుకుంది. సహకార కేంద్ర బ్యాంకును విభజించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ప్రస్తుతం కర్నూలు కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రెండుగా విభజించనున్నారు. ప్రస్తుతం వివిధ బ్రాంచులు, సింగిల్ విండోలను ఏ జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోకి తేవాలో అధికారులు నిర్ణయం తీసుకునే విషయంలో చర్చిస్తున్నారు. ప్రస్తుతం డీసీసీబీ పాలకవర్గాల పర్సన్ల ఇన్‌చార్జిల పదవీ కాలం ముగిసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. త్వరలోనే బ్యాంకు విభజన ప్రక్రియ పూర్తయితే.. రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులో సేవలు దక్కనున్నాయి.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

బేతంచెర్ల, ఆగస్టు 10: మండలంలోని బుగ్గానిపల్లె-కృష్ణమ్మ కోన రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారి పడి గుర్తు శనివారం తెలియని వ్యక్తి మృతి చెందాడు. నంద్యాల జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ వివరాల మేరకు.. తుగ్గలి రైల్వేస్టేషన్‌లో రాత్రి 11.30 గంటలకు డోన్‌కు వెళ్లేందుకు 55 ఏళ్ల వ్యక్తి టికెట్ తీసుకుని రైలులో ప్రయాణించాడు. డోన్‌లో దిగకుండా రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు సిమెంటునగర్ కృష్ణమ్మ కోన రైల్వేస్టేషన్ల మధ్య జారి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం రైల్వే సిబ్బందికి సమాచారం అందడంతో సంఘలనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని నంద్యాల రైల్వే ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

కోడుమూరు (రూరల్), ఆగస్టు 10: మండలంలోని పులకుర్తిలో భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం కార్యాలయంలో సీఐ మన్సూరుద్దీన్ కేసు వివరాలను వెల్లడించారు. పులకుర్తి గ్రామానికి చెందిన కొలాయి సుంకన్న, నాగలక్ష్మి దంపతుల కూతురు మల్లేశ్వరిని బస్తిపాడుకు చెందని రంగడుతో వివాహం జరిపించారు. అయితే తాగుడుకు బానిసైన రంగడు భార్యా పిల్లలను హింసించేవాడు. దీంతో విసుగు చెందిన మల్లేశ్వరి తన ముగ్గురు పిల్లలను తీసుకుని గత నెలలో పుట్టింటికి చేరుకుంది. వెనువెంటనే చేరుకున్న రంగడు మంచిగా ఉంటానని అత్తామామలను నమ్మించాడు. ఈ క్రమంలో గత నెల 31న అర్ధరాత్రి పూటుగా తాగి వచ్చిన రంగడు భార్య, అత్తామామలతో గొడవకు దిగాడు. రోకలిబండతో భార్య, అత్తలపై దాడి చేసి తలపై కొట్టాడు. అడ్డు వచ్చిన మామపై కూడా దాడికి పాల్పడడంతో కుడి చేతికి గాయాలయ్యాయి. దీంతో తీవ్రంగా గాయపడిన తల్లీ కూతుళ్లను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న భార్య మల్లేశ్వరి కోలుకోలేక ఈనెల 3వ తేదీ మృతి చెందింది. అత్త నాగలక్ష్మి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతోంది. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం పట్టణంలోని తాత గుడి వద్ద నిందితుడు రంగడును అరెస్టు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలనరసింహులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, ఆగస్టు 10: మండలంలోని ఏనుగమర్రి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లా కదిరికి చెందిన క్లీనర్ శంకర్(34) మృతి చెందాడు. మదనపల్లి నుంచి చీనీ కాయల లోడుతో లారీ నాగపూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలోని ఏనుగమర్రి దగ్గరకు రాగానే రోడ్డుపై నిలబడిన మరో వాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్ శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వెంకటాపురంలో గోవిందనామ స్మరణ

గుంటి రంగస్వామికి జలాభిషేకం



గుంటి రంగస్వామి ఆలయం చుట్టూ బోర్ల పడుకున్న మహిళా భక్తులు



గుంటి రంగస్వామి

ఎమ్మిగనూరు, ఆగస్టు 10: ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీ గోవిందనామస్మరణతో మార్మోగింది. శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకొని పవిత్ర తుంగభద్ర నదీ జలాలతో గుంటిరంగ స్వామికి అభిషేకం చేశారు. పూజారి తిమ్మప్ప ఆధ్వర్యంలో కాలనీ వాసులు పట్టణానికి 25 కి.మీ. దూరంలో ఉన్న తుంగభద్ర నదికి కాలినడకన వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం కాలనీకి చెందిన వందలాది మంది యువకులు ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో పూలతో అలంకరించిన బరిసెలు, వేటకొడవళ్లు, గొండ్రగొడ్డళ్లు వంటి ఆయుధాలు, బిందెలతో తుంగభద్ర నదికి చేరుకున్నారు. నది నుంచి నీటిని తీసుకొని తిరిగి కాలనీకి చేరుకోవడంతో ఆడపడుచులు కలశాలతో ఘన స్వాగతం పలికారు. కోరిన కోర్కెలు తీరాలని నెలకొన్న కష్టాలు తొలగాలని కాలనీకి చెందిన పలువురు మహిళలు, భక్తులు ఆలయం ముందు, ఆలయం పక్కన బోర్ల పడుకున్నారు. నది నుంచి వచ్చిన వారు పడుకున్నవారిని దాటుకుంటూ వెళ్తే వారి పాద ధూళి తగిలి తమ కష్టాలు తొలుగుతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. ఈ ఏడాది కూడా కాలనీకి చెందిన పదుల సంఖ్యలో మహిళా భక్తులు బోర్ల పడుకున్నారు. దీంతో వారిని దాటుతూ నదీజలం తెచ్చిన భక్తులు పరుగులు తీస్తూ ప్రదక్షిణలు చేశారు. పడుకున్న వారికి ఆలయం నిర్వాహకులు నీటిని చల్లి ప్రదక్షిణల అనంతరం లేపడం కనిపించింది. వేడుకను తిలకించేందుకు కాలనీతోపాటు పట్టణ ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.



ఆలయం ముందు పోటెత్తిన భక్తులు

సంగమేశ్వరంలో కృష్ణమ్మ పరవళ్లు

● ఎగువ పుష్కర ఘాట్‌ను ముంచెత్తుతున్న వరద జలాలు



సంగమేశ్వరంలో ఎగువ పుష్కరఘాట్ వరకు చేరిన వరద జలాలు

ఆత్మకూరు, ఆగస్టు 10: సప్తనదుల సంగమేశ్వరంలో కృష్ణమ్మ పరవళ్లతో తొణికిసలాడుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీశైల జలశయానికి గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వలు వచ్చి చేరడంతో సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్‌ను వరదజలాలు ముంచెత్తుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైల జలశయానికి ఎగువ జూరాల నుంచి 1,60,540 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,916 క్యూసెక్కుల చొప్పున మొత్తం 2,02,702 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దీంతో జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గానూ 882.50 అడుగులు కాగా, గరిష్ఠ నీటి సామర్థ్యం 215.807 టీఎంసీలకు గానూ 201.588టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. దీంతో సంగమేశ్వరంలోని ఎగువ పుష్కర ఘాట్ చివరి మెట్ల వరకు వరదజలాలు వచ్చిచేరాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు సందర్శకులు సంగమేశ్వరానికి తరలివస్తున్నారు.

21వేల క్యూసెక్కుల నీటి విడుదల



ఎస్సార్ఎంసీ నుంచి వీబీఆర్‌కు వెళ్తున్న నీరు

పాములపాడు, ఆగస్టు 10: మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా శనివారం 21వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఎస్ఆర్ఎంసీ(తెలుగుగంగ) అధికారులు శనివారం తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి 9వేల క్యూసెక్కులు వీబీఆర్‌కు, 10వేల క్యూసెక్కులు జీఎన్ఎస్‌కు, 2వేల క్యూసెక్కుల నీటిని ఎస్కేప్ చానల్‌కు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

వెలుగోడు జలాశయంలో 14 టీఎంసీల నీరు



గాలేరు నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

వెలుగోడు, ఆగస్టు 10: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయంలో శనివారం నాటికి 14 టీఎంసీల నీరు చేరుకుంది. వెలుగోడు జలాశయ సామర్థ్యం 16.95 టీఎంసీలు కాగా 14 టీఎంసీలు చేరుకోవడంతో జలాశయం నీటితో కళకళలాడుతోంది. జలాశయంలోకి బానక చెర్ల సము దాయం నుంచి 11000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి స్పిల్ వే నుంచి 4 వేల క్యూసెక్కులు, చెన్నై ప్రధాన కాలువకు 5 వేల క్యూసె క్కులు, వన్ఆర్ తూము ద్వారా 50 క్యూసెక్కులు వదులుతున్నారు. వన్ఎల్ తూము ద్వారా 30 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి పథకాలకు 15 క్యూసె క్కుల చొప్పున మొత్తం 9100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

'కరువు భత్యం ప్రకటించాలి'



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి

గోస్పాడు, ఆగస్టు 10: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు కరువు భత్యం వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం గోస్పాడులో మాట్లాడుతూ కరువు భత్యం 25 శాతం ప్రకటించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలకు ప్రత్యేక వార్డెన్లను నియమించాలని, సీఆర్‌పీలకు ఉన్నత పాఠశాలలో పని చేసే క్రాఫ్ట్, డ్రాయింగ్, కాంట్రాక్టు టీచర్లకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు సురేష్‌కుమార్, విజయ రావు, సుబ్బరాయుడునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో వాహనాల తనిఖీ



మహానందిలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మహానంది, ఆగస్టు 10: మహానంది పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీసులు మహానంది నుంచి నంద్యాల వైపు వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. హద్దు మీరి, మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'కేరళ బాధితులకు అండగా నిలుద్దాం'



వెలుగోడులో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

వెలుగోడు, ఆగస్టు 10: కేరళ రాష్ట్రంలోని వయనాడులో వరద బాధితులకు తోడుగా నిలుద్దామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. వెలుగోడు పట్టణంలో కేరళ వరద బాధితుల కోసం శనివారం విరాళాలు సేకరించారు. వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తమ వంతు సహకారం అందించి చేయూత నివ్వాలని వారు కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో దుకాణాల వద్ద వారు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం, ఏఐటీయూసీ, ఏఐకేఎఫ్, ఆవాజ్ కమిటీ నాయకులు మహ్మద్ రఫి, ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో శివపురం శివాలయం

● మాన్యం ఉన్నా పూజలకు నోచుకోని ఆలయం

● ప్రాచీన కట్టడాలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం







శిథిలావస్థకు చేరిన శివపురం శివాలయం, పూజలకు నోచుకోని దేవతామూర్తుల విగ్రహాలు, శివలింగం

కొత్తపల్లి, ఆగస్టు 10: రాజులు పోయారు.. రాజ్యాలు అంతరించిపోయాయి. వారు చేసిన సేవలు.. వారు నిర్మించిన అపూర్వ కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా అలనాటి వైభవాన్ని తలపిస్తున్నాయి. రాయలు ఏలిన రతనాల సీమలో ఇంకా వారి గుర్తులు, చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలి ఉన్నాయి. ఈ కోవలోనే కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామంలో వెలసిన ఈశ్వరస్వామి, ఆంజనేయస్వామి, శ్రీకాంత స్వామి ఆలయాలను చెప్పవచ్చు. ఈ ఆలయా లను 11వ శతాబ్దంలో జనమేజయరాజు, మల్ల భూపతిరాజు నిర్మించినట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తోంది. అలాగే ఈ శివపురానికి 101 శివాలయాలు వెలసిన పురం అని, దీనిని శివపురంగా ప్రఖ్యాతి గాంచినట్లు పురాణాలు, గత చరిత్ర చెబుతోంది. ఈ ఆలయాలకు 25.47 ఎకరాల దేవుని మాన్యం ఉంది. దూపదీప నైవేద్యాల కోసం అప్పట్లో అర్చకులకు 16.72 ఎకరాలు, స్వీపరులకు 8.08 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిసింది. అయితే.. పర్వదినాలు, ప్రత్యేక రోజుల్లో మినహాయిస్తే దూప దీప నైవేద్యాలు జరగడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే అలనాటి వైభవానికి దర్పణంగా నిలుస్తున్న శివపురంలోని శివాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. శివాలయం పక్కనే ఉన్న చెరువు దగ్గర మూగలబయన్న అనే స్వామికి చెందిన 250 ఎకరాల మాన్యం శ్రీకాకుళం జిల్లాలో ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. అలాగే ఇక్కడి సమీపంలో ఉన్న కొలనుభారతి అమ్మవారికి కూడా విశాఖ పట్నం జిల్లాలో కొంత మాన్యం ఉన్నట్లు చెబుతుంటారు. ఈ పురాతన ఆలయాలకు మాన్యం ఉన్నా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదని భక్తులు అంటున్నారు. అలనాటి వైభవానికి సాక్ష్యాలుగా నిలిచిన ఈ ఆల యాలు కాలగర్భంలో కలిసిపోకముందే అధికారులు ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టి దూపదీప నైవేద్యాలు జరిపించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో మోహన్‌ను వివరణ కోరగా దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జీర్ణోద్ధరణకు కృషి చేస్తామని చెప్పారు.

ఆలయాల జీర్ణోద్ధరణ చేపట్టాలి



గత చరిత్రకు సాక్ష్యులుగా నిలిచి నేడు శిథిలావస్థకు గురైన ఆలయాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. ఎంతో చారిత్రాత్మకమైన ఆలయాలను కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కింద నిర్మించి ఆలయాలకు పూర్వ వైభవం తేవాలి. అలాగే ఇక్కడే సమీపంలో ఉన్న కొలనుభారతి అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ పనులను వెంటనే చేపట్టాలి.

– శంకర్‌గౌడు, శివపురం

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత ఉందా?

● వైసీపీ నాయకులపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఆగస్టు 10: గడిచిన ఐదేళ్లలో దళితులపై వైసీపీ నాయకులు చేసిన అరాచకాల దృష్ట్యా వారికి అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత ఉందా? అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రశ్నించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు జగన్మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అవమానాలే జరిగాయన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి రాజారెడ్డి అమలు చేశారని, జగన్మోహన్‌రెడ్డికి అంబేడ్కర్ విగ్రహాలను తాకే అర్హత లేదని అన్నారు. అమరావతిలో రూ.174 కోట్లతో అంబేడ్కర్ స్మృతి వనాన్ని నిర్మాణానికి తలపెడితే జగన్మోహన్‌రెడ్డి సర్వనాశనం చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య పేరుతో ఉన్న దాన్ని ఆ పేరును తొలగించి జగన్మోహన్‌రెడ్డి విదేశీ విద్య అని పేరు పెట్టుకున్న జగన్మోహన్‌రెడ్డి నేడు అంబేడ్కర్ గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఒక పార్టీ జెండా రంగులను ప్రభుత్వ కార్యాలయాలకు వేయలేదని, గత ప్రభుత్వానికే ఈ ఘనత దక్కుతుందని అన్నారు. పాసుపుస్తకాలపై కూడా ఆయన ఫొటోలు వేసుకున్న ఘనత జగన్‌కే దక్కుతోందన్నారు. దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసిన జగన్మోహన్‌రెడ్డి నేడు అంబేడ్కర్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను దోచుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఇంత చేసిన జగన్‌ను దళిత ద్రోహి అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. మాస్కులను అడిగిన డా.సుధాకర్‌ను పిచ్చివాడిగా ముద్ర వేసి చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. నవరత్నాలకు నవరంధ్రాలు పడడంతో 2024లో వైసీపీ నావ అనేది మునిగిపోయిందని ఎద్దేవా చేశారు. అంతకంటే ఎక్కువ బాధ్యతతో ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రతీకార చర్యలకు పాల్పడవద్దని చెప్పడంతోనే ఆయన రాజకీయ పరిపక్వత ఏమిటని అర్థమవుతోందన్నారు. ఇకనైనా జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబు నాయుడును చూసి నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు ముర్తుజావలి, లాయర్ జాకీర్, పలుచాని మహేశ్వరరెడ్డి, జమీల్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

శ్రీశైలం, ఆగస్టు 10: శ్రీశైలం మహాక్షేత్రంలోని సుబ్రహ్మణ్య స్వామికి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు, అనం తరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి స్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మంగళ హారతులు ఇచ్చారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఆగస్టు 10: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం సికింద్రాబాద్ చెందిన పద్మావెంకటేశ్ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయక పంచరత్నాలు, మహిషాసురమర్దిని, శివ తాండవం, తదితర గీతాలకు కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు.

నృత్య ప్రదర్శన పోటీలు



నృత్యం చేస్తున్న బాలికలు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 10: నంద్యాల కళారాధన ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్య వేడుకలను పురష్కరించుకొని శనివారం నంద్యాల టౌన్ హాల్ ప్రాంగణంలో జూనియర్, సీనియర్ విభాగాలలో శాస్త్రీయ, జానపద, సోలో, బృంద నృత్యాల పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతగా శ్రీమన్నారాయణ వ్యవహరిం చారు. కూచిపూడి, భరతనాట్యం రీతులలో చక్కటి హాహాభావాలతో, ముద్రలతో నృత్యాలు ప్రదర్శించి విశేష ప్రతిభ కనబరిచారు. ఏక పాత్రాభినయ నాలు, మిమిక్రీ పోటీలకు నంది నాటక నటులు డీసీపీ శర్మ, శివరామిరెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలను కళారాధన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.మధుసూదనరావు, డా.రవికృష్ణ, మజీద్, హర్షకిషోర్ పర్యవేక్షిం చారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఏడు శనివారాల వ్రతం



నంద్యాలలో ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 10: నంద్యాలలో వెలసిన అమ్మవారిశాలలో శనివారం వేంకటేశ్వరుడికి ఏడు శనివారాల వ్రతం చేశారు. ఏడు శనివారాలు స్వామికి వ్రతం చేసి చివరగా స్వామి కల్యాణం నిర్వహిస్తు న్నట్లు మహిళా మండలి సభ్యులు తెలిపారు. భక్తుకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళా మండలి అధ్యక్షురాలు కళావతి, రాజేశ్వరి, జ్యోత్స్న, పుష్పలత, సంధ్య, అరుణ, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ రిటైల్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ డీఏవోగా శ్రీనివాసులు

ఆత్మకూరు, ఆగస్టు 10: ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (డీఏవో)గా బి.శ్రీనివాసులును నియమిస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ డీఏవోగా విధులు నిర్వహిస్తున్న సిరాజుద్దీన్ పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో బి.శ్రీనివాసులును ఇక్కడికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇటీవల ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయ డీఏవోగా తహసీల్దార్ అంజనా దేవిని నియమించగా ప్రస్తుతం ఆమె బదిలీని రద్దు చేసి శ్రీనివాసులును నియమించారు.

పార్కులకు మోక్షమెన్నడో?

● వేధిస్తున్న ప్రభుత్వ స్థలాల కొరత

● పట్టించుకోని అధికారులు, పాలకులు



ఆత్మకూరులోని సాయిబాబానగర్‌లో గతంలో పార్కు కోసం కేటాయించిన స్థలం

ఆత్మకూరు, ఆగస్టు 10: ఆత్మకూరు పురపాలక ప్రజలకు ఆహ్లాదం కరువైంది. తీరిక సమయాల్లో ప్రశాంతమైన వాతావరణంలో విశ్రాంతి తీసుకునే ప్రదేశాలే కరువయ్యాయి. అయితే పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు పార్కులను ఏర్పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆత్మకూరు పట్టణాన్ని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. ప్రస్తుతం పట్టణంలో మున్సిపల్ చట్టాలనే అమలు చేస్తున్నారు. అయితే అనేక మున్సిపాలిటీల్లో పార్కుల ఏర్పాటు జరిగినప్పటికీ ఆత్మకూరులో మాత్రం పార్కుల ఏర్పాటుకు ఒక్క అడుగు పడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆత్మకూరు మున్సిపాలిటీలో ప్రస్తుతం 12వేలకు పైగా కుటుంబాలు నివాస ఉండగా సుమారు 70వేల వరకు జనాభా ఉంది. మున్సిపాలిటీ చట్టాల పేరుతో ఏటా రెండు విడతల్లో భారీగా పన్నులను వసూళ్లు చేస్తున్న అధికారులు అదే స్థాయిలో ప్రజలకు సేవలను కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రత్యేకించి ఆత్మకూరు పట్టణంలో పార్కుల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ స్థలాల కొరత ఇబ్బందిగా మారింది. ఇదే అదునుగా భావించి పార్కుల ఏర్పాటు అంశాన్ని మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది. పట్టణ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు కాస్త విశ్రాంతి తీసుకునేందుకు పార్కులకు వస్తుంటారు. అయితే ఆత్మకూరులో ఎక్కడా పార్కులు లేకపోవడంతో సేదతీరే ప్రదేశమే లేకపోవడంతో మానసికంగా నిరుత్సాహానికి లోనవుతున్నారు. గతంలో టీడీపీ హయాంలో పల్లెల్లో కూడా గ్రామీణ ఉద్యానవనాలను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు కూడా ఆహ్లాదాన్ని అందించే ప్రయత్నం చేశారు. పార్కుల ఏర్పాటు అంశంపై మున్సిపల్ అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పార్కు ఏర్పాటులో అలసత్వం

ఆత్మకూరులోని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా 2010లో సాయిబాబానగర్‌లో పార్కు ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని కేటాయించి శంకుస్థాపన చేశారు. అయితే ఇంతవరకు ఆ స్థలంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఆ స్థలంలో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి మున్సిపాలిటీ పరిధిలో పార్కులను ఏర్పాటు చేసి ప్రజలకు మానసిక ఆనందాన్ని అందించాల్సిన బాధ్యత సంబంధిత మున్సిపల్‌శాఖపై ఉన్నప్పటికీ ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలావుంటే ఏడేళ్ల క్రితం ఆత్మకూరు పట్టణంలో రెండు పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి 50సెంట్ల వరకు రెండు చోట్ల స్థలాలను కేటాయించాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే పార్కుల ఏర్పాటుకు అవసరమయ్యే స్థలాలు లేవని స్థానిక మున్సిపల్ అధికారులు చెప్పడంతో పార్కుల ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పటికైనా.. మున్సిపాలిటీ అధికారులు స్పందించి ఆత్మకూరు పట్టణంలో పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారులు అధ్వానం

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



దెబ్బతిన్న దుద్యాల రహదారి



అధ్వానంగా ఉన్న గువ్వలకుంట్ల, పాలెంచెరువు గ్రామాల రోడ్డు

కొత్తపల్లి, ఆగస్టు 10: గుంతలమయమైన రోడ్లపై గమ్యస్థానాలకు చేరాలంటే కష్టంగా ఉందని మండలంలోని దుద్యాల, లింగాపురం, గుమ్మడాపురం, పాలంచెరువు గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులపై గంపెడు మట్టి కూడా వేయలేదని, ప్రస్తుత వర్షాకాలంలో రహదారులపై గుంతలు ఏర్పడి.. ద్విచక్రవాహనాలతో పాటు ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఆత్మకూరు-దుద్యాల, గువ్వలకుంట్ల, పాలెంచెరువు, లింగాపురంలోని బస్టాండు సెంటర్లతో పాటు పెద్దగుమ్మడాపురం రహదారులు పూర్తిగా అధ్వాన్నంగా తయారై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పాలక ప్రభుత్వమైనా గ్రామీణ ప్రాంతాల రహదారులను సంబంధిత అధికారుల ద్వారా క్షేత్ర స్థాయి పరిశీలన చేయించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


శివాలయాలకు పోటెత్తిన భక్తులు



శ్రీశైలంలో దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

శ్రీశైలం, ఆగస్టు 10: శ్రీశైలం మహాక్షేత్రానికి శనివారం తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. శనివారం వేకువ జాము నుంచే భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ కట్ట వద్ద స్వామికి తలనీలాలు సమర్పించి, పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అధికారులు అల్పాహారం, నిరంతరం తాగునీరు అందజేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర ప్రధాన వీధులు రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన భవనంలో అన్న ప్రసాద వితరణ చేశారు. క్షేత్ర పరిధిలోని సత్ర సముదాయాలు రద్దీగా కనిపించాయి. శ్రీశైల జలాశయం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో పర్యాటకుల తాకిడి కొనసాగుతోంది. వారాంతరం సెలవు రోజులు రావడంతో మరో రెండు రోజులు క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

మహానంది: వరుస సెలవులు రావడంతో మహానంది క్షేత్రం వేలాదిమంది భక్తుల రద్దీతో పోటెత్తింది. శ్రావణమాసం కావడంతో పాటు శనివారం వీకెండ్ కావడంతో తెలుగు రాష్ట్రాల నుండే కాక కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తుల తాకిడి పెరిగింది. నమఃశివాయ అంటూ ప్రధాన ఆలయాల్లో భక్తులు శివనామస్మరణ చేస్తూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



మహానందిలో..

పేదలకే కోసమే అన్న క్యాంటీన్లు: ఎమ్మెల్యే


అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, ఆగస్టు 10: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు పేదల కోసం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని నాగులకట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణాన్ని శనివారం ఆమె పరిశీలించారు. అధికారంలోకి రాగానే అన్న క్యాంటిన్లను జగన్ రద్దు చేసి పేదల కడుపులను ఆకలితో మాడ్చారని ఆరోపించారు. పేదలు ఆకలి ఉండకూడదన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం తిరిగి అన్న క్యాంటిన్లను ఏర్పాటు చేయడం పట్ల పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆళ్లగడ్డలో రెండు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చానని, మొదటి విడతలో ఆగస్టు 15వ తేదీన ఒకటి ప్రారంభిస్తామని, రెండోది రెండో విడతలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పేదల కుటుంబాలకు అండగా నిలిచి వారిని ఆదుకున్నారన్నారు. పరామర్శకు వచ్చిన జగన్ పథకాల గురించి మాట్లాడుతున్నారే తప్ప బాధిత కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సాయం అందించలేదని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు, కౌన్సిలర్ హుసేన్‌బాషా, సోముల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్ రూరల్ సీఐగా సీఎం రాకేష్

డోన్(రూరల్), ఆగస్టు 10: డోన్ రూరల్ సీఐగా సీఎం రాకేష్ శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ అస్రత్‌బాషా బదిలీ కావడంతో ఆయన స్థానంలో నంద్యాల సైబర్ క్రైమ్‌లో పని చేస్తున్న సీఎం రాకేష్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారిస్తామన్నారు.

ప్యాపిలి సీఐగా వెంకటరామిరెడ్డి

ప్యాపిలి, ఆగస్టు 10: ప్యాపిలి సీఐగా వెంకటరామిరెడ్డి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ సుధాకర్‌రెడ్డి నంద్యాల వన్‌టౌన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రభుత్వం గుత్తి సీఐగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని నియమించింది. సీఐ మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు నేరుగా తనను కలవొచ్చన్నారు.

కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా బాల ఈశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల, ఆగస్టు 10: కొలిమిగుండ్ల మండల నూతన తహసీల్దార్‌గా బాల ఈశ్వరరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ రాజాకుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా కొలిమిగుండ్ల తహసీల్దార్‌గా వచ్చిన సునీతాబాయి తిరిగి అదే జిల్లాకు వెళ్లిపోయింది. వారం రోజుల క్రితమే ఆమె ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో ఖాళీగా ఉన్న కొలిమిగుండ్ల మండలానికి బాల ఈశ్వరరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

17న ఎస్‌ఎంసీ ఎన్నికలు

శిరివెళ్ల, ఆగస్టు 10: మండలంలో యాజమాన్య కమిటీల ఎన్నికల ప్రక్రియ వాయిదా పడిన ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 17న ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్ శనివారం తెలిపారు. మండలంలోని శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల, వనికెందిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో కోరం లేకపోవడంతో అధికారులు ఎన్నికలను వాయిదా వేశారన్నారు. ఈ రెండు పాఠశాలలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసి ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. వీటిలో ఏవైనా అభ్యంతరాలుంటే విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

చలో హైదరాబాదుకు తరలిరండి

కొలిమిగుండ్ల, ఆగస్టు 10: హైదరాబాదులో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహిస్తున్న వర్గీకరణ విజయోత్సవ ర్యాలీకి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఎమ్మార్పీస్ సీనీయర్ నాయకుడు ఇరిక మాను నాగేశ్వరావు, మండల నాయకుడు కొండ రామయ్య పిలుపునిచ్చారు. మందకృష్ణమాదిగ వర్గీకరణ తీర్పు తరువాత మొద టిసారి తెలుగు గడ్డపై అడుగు పెడుతున్న సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. సుంకన్న, పుల్లయ్య, కుళ్లాయప్ప, నాగన్న, శీను, కిట్టు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

బేతంచెర్ల, ఆగస్టు 10: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన తెలుగు వెంకటేశ్వరమ్మపై అదే గ్రామానికి చెందిన సయ్యద్ మహ్మద్‌గౌస్ కుటుంబ సభ్యులు కలిసి దాడి చేసి కొట్టారని కేసు నమోదైనట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం వలి శనివారం తెలిపారు. వెంకటేశ్వరమ్మకు చెందిన చిప్స్ ఫ్యాక్టరీ లీజు విషయంలో సయ్యద్ మహ్మద్ గౌస్ అతని కుటుంబ సభ్యులు కలిసి వెంకటేశ్వరమ్మను కొట్టి గాయపరిచారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

'పశు వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఆగస్టు 10: పశువుల్లో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ సూచించారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో పశువులకు వివిధ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. గొంతువాపు, గర్భకోశ వ్యాధులు, నీలి నాలుక, ఆంత్రాక్స్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినీ గోకులాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెక్షన్ ఆఫీసర్‌కు పదోన్నతి

చాగలమర్రి, ఆగస్టు 10: మండలంలోని డి.వనిపెంట సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులునాయుడు డిప్యూటీ రేంజి ఆఫీసర్‌గా శనివారం పదోన్నతి పొందారు. ఆయన కడప జిల్లా పోరుమామిళ్లకు బదిలీ అయ్యారు. డి.వనిపెంట ఇన్‌చార్జి సెక్షన్ ఆఫీసర్‌గా ఆలమూరు సెక్షన్ అధికారి మక్తియార్‌బాషా అదనపు బాధ్యతలు చేపట్టారు.

అందని ఆయుష్మాన్ సేవలు

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- ఐదేళ్లుగా మూతబడిన ఆయుర్వేదిక్ కేంద్రం


ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం

కొలిమిగుండ్ల, ఆగస్టు 10: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ సేవలు ఆరేళ్లుగా నిలిచిపోయాయి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు ఎంతగానో ఉపయోగపడే ఆయుర్వేదిక్ వైద్య సేవలు అందకపోవడంతో మండల ప్రజలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గతంలో ఈవిభాగానికి సంబంధించి కొలిమిగుండ్ల పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యుడితోపాటు, సిబ్బంది ఉండే వారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఆయుర్వేదిక్ వైద్య సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడంతోటు, మందులను కూడా సరఫరా చేయలేదు. దీంతో ఆయుర్వేదిక్ విభాగం పూర్తిగా మూతబడింది. దుష్పలితాలు లేని ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలు మొగ్గుచూపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వైద్యశాలను మూసివేయడం తగదని పలువురు వాపోతున్నారు. దీర్ఘకాలిక రోగులను ఆదుకునే ఆయుర్వేదిక్ విభాగాన్ని తిరిగి పునరుద్ధరించాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల

చిన్నపాటి వర్షానికే కారుతున్న భవనం

కోవెలకుంట్ల, ఆగస్టు 10: పశువైద్యశాల శిథిలావస్థకు చేరడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కోవెలకుంట్లలో అప్పటి నాయకులు, అధికారులు, 1971లో తాలుకా స్థాయి పశువైద్యశాల నిర్మించారు. ప్రస్తుతం కోవెలకుంట్ల పశువైద్యశాల పరిధిలో కోవెలకుంట్ల మండలం, గోస్పాడు మండలాలు ఉన్నాయి. కోవెలకుంట్ల మండలంలో బిజినవేముల, కలుగొట్ల గ్రామాల్లో పశువైద్యశాలలు, భీమునిపాడు, రేవనూరు, కంపమల్ల గ్రామాల్లో మినీ పశువైద్య కేంద్రాలతోపాటు చిన్నకొప్పెర్ల సచివాలయం, చౌదరిదిన్నె, కోవెలకుంట్ల-5 పరిధిలో గ్రామీణ పశువైద్య సహాయకులు పని చేస్తున్నారు. బిల్డింగు లోపల ఉన్న దంతెలు విరిగిపోయాయి. దీనికి తోడు చిన్నపాటి వర్షం వస్తే నీరంతా గదిలోకి వచ్చి రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని కోవెలకుంట్ల పశు సంవర్ధక శాఖ ఈడీ కె.వీరబ్రహ్మం తెలిపారు.


దంతెలు విరగడంతో పోట్లు పెట్టిన దృశ్యం



శిథిలావస్థలో కోవెలకుంట్ల పశు వైద్యశాల

ప్రజలు ఓడించినా బుగ్గనకు బుద్ధి రాలేదు: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

డోన్, ఆగస్టు 10: బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ప్రజలు ఓడించినా ఇంకా బుద్ధి రాలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించడం సిగ్గు చేటన్నారు. ఆర్థిక మంత్రి హోదాలో బుగ్గన డోన్ నియోజకవర్గంలో ఎలా దోచుకున్నారో ప్రజలందరూ చూశారన్నారు. ప్రజలు ఏమైనా సమస్యలు చెప్పుకోవాలంటే ఏ రోజైనా బుగ్గనను కలిసే అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. అమరావతి, ఢిల్లీ చుట్టూ బుగ్గన ప్రదక్షిణలు చేస్తూ తన స్వలాభం చూసుకున్నాడే తప్ప. ప్రజలను అస్సలు పట్టించుకోలేదన్నారు. డోన్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్యాపిలి మండలంలోని పూడొడ్డిలో తన మైనింగ్ వ్యాపారాల కోసం బుగ్గన వైసీపీ నాయకులను రెచ్చగొట్టి టీడీపీ నాయకులపై దాడి చేయించారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కోట్ల ఫ్యాక్షన్‌ను ప్రోత్సహిస్తున్నాడని బుగ్గన అనడం విడ్డూరంగా ఉందని, వెంకటనాయునిపల్లె టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ మాదవయ్యను హత్య చేసింది వైసీపీ నాయకులు కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఓంప్రకాష్, ఎస్‌ఎండీ రఫీ, తోట మనోహర్, గోవిందరెడ్డి, తాడూరు వెంకటరమణయ్య, చనుగొండ్ల శ్రీరాములు, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, బీజేపీ నాయకులు ఆర్మీ రామయ్య పాల్గొన్నారు.

టర్మినల్ మార్కెట్ ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే కోట్ల


కోట్లను కలిసిన శిల్పాదేశ్ పాండే

డోన్, ఆగస్టు 10: డోన్ నియోజకవర్గంలో పండ్ల తోటలను ప్రోత్సహించేందుకు ప్యాపిలిలో టెర్మినల్ మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాదులోని దివంగత మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని జనసేన నాయకులు పరదేశీ మహేష్ ఆధ్వర్యంలో నాబార్డు కన్సల్టెన్సీ వైస్ ప్రెసిడెంట్ శిల్పా దేశ్‌పాండేలు కలిశారు. టెర్మినల్ మార్కెట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటుకు సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోట్లను వారు కోరారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి డోన్ నియోజకవర్గంలో పండ్ల తోటల సాగును పెంచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోట్ల అన్నారు. నూతన ప్రతిపాదనలతో టెర్మినల్ మార్కెట్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలన్నారు. సీఎం చంద్రబాబును కలిసి వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటు రైతులకు అటు యువతకు మేలు జరిగేలా పరిశ్రమలను నెలకొల్పుతామన్నారు.

కోట్ల సుజాతమ్మకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న ఏఈ నాగరాజు

డోన్(రూరల్), ఆగస్టు 10: డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజా తమ్మకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నామినేటెడ్ పదవిని కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు కోరారు. శనివారం డోన్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబు డోన్ పర్యటనకు వచ్చినప్పుడు కోట్ల సుజాతమ్మకు మంచి పదవిని ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో డోన్ బీసీ సంక్షేమసంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి పల్లకీ ఉత్సవం


చెన్నకేశవ ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

చాగలమర్రి, ఆగస్టు 10: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో గల చెన్నకేశవ, సంజీవరాయ, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులకు శనివారం పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా సంజీవరాయ, చెన్నకేశవ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు సంజీవరాయ స్వామికి తమలపాకులతో అభిషేకాలు చేశారు. అనంతరం పురవీధుల గుండా చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నర్స య్య, కమిటీ సభ్యులు నారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ ఉద్యోగులు రామ్మోహన్, రఘు, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ


రిజిస్టరును పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి

రుద్రవరం, ఆగస్టు 10: మండలంలోని యల్లావత్తుల ఉప కేంద్రాన్ని డిస్ట్రిక్ నోడల్ ఆఫీసర్ జగదీశ్ చంద్రారెడ్డి శనివారం తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అధికారి మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. బీపీ, షుగరు పేషంట్లకు ప్రతినెలా సరిపడా మందులు ఇస్తున్నారా?, లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండి వైద్యం అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మలేరియా, ఫ్రైడే డ్రైడే, వాటర్‌టెస్టింగ్‌లాంటి వల్ల ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివమోహన్ ఉన్నారు.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.5.09 లక్షలు

బేతంచెర్ల, ఆగస్టు 10: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.5.09 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచేగాక ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశ ఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.5,09,000 ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.

రహదారులకు ప్రతిపాదనలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 10: నియోజకవర్గంలోని పలు రహదారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ డీఈ సునిల్‌కుమార్‌రెడ్డి శనివారం వెల్లడించారు. అంకిరెడ్డిపల్లె- తిమ్మనాయినిపేట రహదారి 13.8కి.మీ గాను రూ.29 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా కోవెలకుంట్ల-సంజామల, ముక్కమళ్ల, ఆకుమళ్ల లింక్ రోడ్డులో కలిపి 8.3కి.మీ రూ.23 కోట్లు, నందివర్గం- ఎస్.కొత్తూరు, కేకేబీ-పలుకూరు రోడ్డు 5కి.మీ రూ.22 కోట్లు, పెట్నికోట- పేరుసోముల వయా మీర్జాపురం మీదుగా 12.6కి.మీ. రూ.30కోట్లు, సంజామల- పేరుసోముల 14.2కి.మీ. రూ.29కోట్లు డబుల్ లైన్ రోడ్లకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. సెంట్రల్ రోడ్ ఫండ్ కోసం ఈ ప్రతిపాదనలు పంపినట్లు డీఈ వెల్లడించారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, ఆగస్టు 10: కోవెలకుంట్ల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన హనుమంతనాయక్‌ను శనివారం మండలంలోని వెలగటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ధనుంజయుడు యాదవ్, మనోహర్ యాదవ్‌లు సర్కిల్ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు.

ఎంపీడీవో బదిలీ

ఉయ్యాలవాడ, ఆగస్టు 10: ఉయ్యాలవాడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రఘురామ్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. కడప జిల్లా సిద్దౌట్‌లో మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావు బదిలీపై ఇక్కడి వచ్చారు. వీరు గత సార్వత్రిక ఎన్నికల్లో బదిలీలపై వెళ్లగా ఎన్నికల అనంతరం వారి వారి స్థానాలకు జిల్లా అధికారులు వీరిని బదిలీ చేశారు. సోమవారం ఉమామమహేశ్వరరావు విధులకు హాజరు కానున్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


డోన్, ప్యాపిలిలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు

డోన్(రూరల్), ఆగస్టు 10: పట్టణంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాత బస్టాండు ప్రాంతంలో జెండాను యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసు బ్బారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, సుబ్బరాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టిలు పాల్గొన్నారు.

ప్యాపిలి: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ పోరాడుతుందని సంఘం నాయకుడు లతీఫ్ అన్నారు. పట్టణంలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిచారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, శాంతిప్రియా, మాణిక్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామికి పూజలు


పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

చాగలమర్రి, ఆగస్టు 10: చాగలమర్రి గ్రామంలోని వీరాంజనేయ, పట్టాభిరామ, కోదండరామ, చెన్నకేశవ ఆలయాల్లో శ్రావణమాసం సందర్భంగా శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో మహిళలు వీరాంజనేయ స్వామికి తమలపాకులతో అభిషేకాలు చేశారు. ఆంజనేయస్వామి వ్రతాన్ని, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గుండం ఆంజనేయ స్వామికి..


పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 10: మండలంలోని కోరుమానుపల్లె సమీపంలోని గుండం ఆంజనేస్వామికి టీడీపీ నాయకులు పూజలు చేశారు. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో టీడీపీ నాయకుడు ఇటిక్యాల బాలిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు పేట్నికోట హుస్సేన్‌రెడ్డి, చంద్రశేఖర‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీంద్ర, కొండయ్య లు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో స్వామివారికి ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


నాగలక్ష్మికి ఆర్థిక సాయం చేస్తున్న పోచా వెంకటరామిరెడ్డి

సంజామల, ఆగస్టు 10: కాలేయ వ్యాధితో బాధపడుతున్న విద్యార్థినికి ముక్కమళ్ల మాజీ సర్పంచ్ పోచా వెంకటరామిరెడ్డి రూ.లక్ష అందజేశారు. ముక్కమళ్ల గ్రామానికి చెందిన వెంకటరమణ నాగలక్ష్మి దంపతులకు ఇరువురు ఆడపిల్లలు, పెద్ద కూతురు సుకన్య స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. చిన్న కూతురికి బుద్ధిమాంద్యం కాగా సుకన్య కాలేయ వ్యాధికి గురైంది. ప్రస్తుతం కర్నూలు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. వైద్యులు సుకన్యకు కాలేయ మార్పిడి చేయాలని సూచించారు. కూలి పనులకు వెళ్తే కానీ కుటుంబం గడవని కుటుంబం కావడంతో స్థానిక పాఠశాలలోని విద్యార్థులు రూ.7వేలు, ఉపాధ్యాయులు రూ.57,500, హెచ్‌ఎం నాగరాజు ఆయన మిత్రులు రూ. 20 వేలు తల్లిదండ్రులకు అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఆగస్టు 10 : మండలంలోని వాసాపురంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మలు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. వాసాపురం వేంకటేశ్వరస్వామి, లక్ష్మీగోదాదేవి అమ్మవారు మానసలింగేశ్వరస్వామి, త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కాలినడకన వర్షం సైతం లెక్క చేయకుండా దేవాలాయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు తొందరెందుకు?


మాట్లాడుతున్న ఆజాంబేగ్

బేతంచెర్ల, ఆగస్టు 10: ఉపాధ్యాయుల సర్దుబాటుకు తొందర ఏం వచ్చిందని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆజాంబేగ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం మండల ఆర్థిక కార్యదర్శి క్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని అన్నారు. వేల సంఖ్యలో ఉపాధ్యాయుల పోస్టులు రద్దు కావడమేగాక దాదాపు 16 వేల మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులు ఉన్నట్లు, తొమ్మిది వేల మంది ఉపాధ్యాయులు అవసరం ఉన్నట్లు విద్యాశాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయని తెలిపారు. ఆదినారాయణ, సుబ్బారెడ్డి, రఘునాథ్ రెడ్డి, పాపారాయుడు పాల్గొన్నారు.


కుష్టు సర్వే పరిశీలన

చాగలమర్రి, ఆగస్టు 10: చాగలమర్రి గ్రామంలో ఆశా వర్కర్లు చేస్తున్న కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను నోడల్ పర్సన్ రామలింగారెడ్డి శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉన్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామని చెప్పారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో కుష్టువ్యాధి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించగా 256 అనుమానిత కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మెయిల్ వలంటీర్లు ఉన్నారు.

రేపటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

ఉయ్యాలవాడ, ఆగస్టు 10: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు, గ్రామ కార్యదర్శులను ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ మహీంధర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక మోడల్ స్కూల్‌లో ప్రతి రోజు ఉదయం ఉదయం 9 గంటల నుంచిసాయంత్రం 6 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. ఈ శిక్షణా తరగతులకు కోర్సు డైరెక్టర్లుగా ఎంపీడీవో, ఈవోపీఆర్డీలతో పాటు శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్సు, పోర్ట్రోల్ డాటా ఎంట్రీ కోసం ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంటులు హాజరు అవుతారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తప్పక హాజరు అవ్వాలని ఆయన తెలిపారు.

మూతపడ్డ మినరల్ వాటర్ ప్లాంట్లు



చాగలమర్రిలో మూతపడ్డ వాటర్ ప్లాంట్

చాగలమర్రి, ఆగస్టు 10: చాగలమర్రి గ్రామంలో ప్రజలకు శుద్ధజల నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లు మూత పడ్డాయి. గ్రామంలోని కోటగడ్డవీధి, పాతబస్టాండులలో గల వాటర్ ప్లాంట్లు మూతపడటంతో ఆయా వీధి ప్రజలకు మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిధులు వెచ్చించి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మూతపడటంతో ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్‌ల వద్దకు వెళ్లి మంచి నీరు తెచ్చుకుంటున్నారు. మూతపడ్డ వాటర్ ప్లాంట్‌ల గురించి పంచాయతీ అధికారులు, సంబంధిత నిర్వాహకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మూతపడ్డ వాటర్ ప్లాంట్‌లు పని చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.